

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

## వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

### పరోమితర్ ఎక్‌దిన్

**భాష:** బెంగాలి, **సినిమాటోగ్రఫీ** - అవిక్‌ముఖర్జీ; **సంగీతం:** జ్యోతికాదాస్ గుప్త; **దర్శకత్వం** - అపర్ణాసేన్;
**నటీనటులు** - అపర్ణాసేన్ (సానాకా), రితుపర్ణసేన్ గుప్తా, (పరోమిత), సౌమిత్ర చటర్జీ, దులాల్ లాహరి.
**విడుదల:** 2000




**మానవజీవితంలో** 'స్నేహం' ఓ అద్భుతమైన భావన, అన్ని రకాల ప్రేమలూ అనుబంధాలూ కలబోసి చూసినప్పుడు స్నేహం గొప్ప స్వార్థరహితమైన జీవానుబంధాన్ని కలిగి ఉంటుంది. ఇద్దరు మనుషుల మధ్య ఏర్పడే స్నేహం అన్ని అడ్డుగోడల్ని బద్దలు కొడుతుంది. ఆప్యాయతల్ని మంచిపెట్టి గొప్ప ఆలంబనంగా నిలుస్తుంది.

అలాంటి ఒక గాఢమైన బంధాన్ని ఇతివృత్తంగా చేసుకుని సుప్రసిద్ధ దర్శకురాలు అపర్ణాసేన్ ఓ మంచి సినిమా నిర్మించారు. ఇద్దరు స్త్రీల మధ్య అందునా అత్తాకోడళ్ళయిన ఇద్దరు స్త్రీల నడుమ ఎదిగిన స్నేహం అనుబంధం పరస్పర ఆలంబనల్ని అపర్ణాసేన్ 'పరోమితర్ ఎక్‌దిన్' చిత్రంలో విశ్లేషించి, దృశ్యకీరించారు. ఈ చిత్రంలో మహిళల్లో ఉండే తమదైన ప్రపంచపు సూక్ష్మాతి సూక్ష్మమైన అంశాల్ని తడిమారు. సంఘం, సాంఘిక విలువలు వ్యక్తిగతమైన స్వేచ్ఛల నడుమ ఉల్లిపొరలా

వణుకుతున్న స్త్రీల వ్యక్తిత్వాన్ని వారి అనుబంధాల్ని ఈ చిత్రంలో సున్నితంగా చూపించారు దర్శకురాలు. సాంఘిక కట్టుబాట్ల నడుమ తీవ్రమైన ఒత్తిడులకు గురయ్యే ఇద్దరు స్త్రీల మధ్య స్నేహాప్యాయతల్ని ‘పరోమితర్ ఏక్‌దిన్‘ చర్చించింది. సనాతన ఉమ్మడి కుటుంబాల్లో కనిపించే విలువల వ్యవస్థని ఈ చిత్రం స్పష్టంగా ఆవిష్కరిస్తుంది. అత్తాకోడలుగా ఆ ఇద్దరి నడుమ ఆరంభమైన వారి స్నేహబంధం, కుటుంబ సంబంధాలు విచ్ఛిన్నమైనప్పటికీ కొనసాగడం మనుషుల్లోపల ఉండే ఆత్మీయ స్పర్శకి నిదర్శనం.



‘36, చౌరంఘీలేన్‘ చిత్రం నుంచి మొదలు స్త్రీలను, స్త్రీ సమస్యలను ముఖ్యాభినేతలుగా చేసి అపర్ణాసేన్ తన చిత్ర పరంపరను కొనసాగిస్తున్నారు. ఆ క్రమంలోనే విడుదలైన ‘పరోమితర్ ఏక్‌దిన్‘ సున్నితమైన అనుబంధాన్ని మరింత సున్నితంగా విశ్లేషించింది. ఈ చిత్రం జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో గొప్ప పేరును సంపాదించుకుంది.

చిత్రకథాంశంలోకి వస్తే పరోమితకు ఉత్తర కలకత్తానగరంలో నివసిస్తున్న ఓ సాంప్రదాయ బద్ధమైన కుటుంబంలోని బిరేష్‌తో వివాహమవుతుంది. పెళ్ళయిన అతి తక్కువకాలంలోనే తనకూ తన భర్తకూ అనేక అంశాల్లో ఏకాభిప్రాయం లేదని పరోమిత గమనిస్తుంది. అంతేకాదు తన భర్తకు తాను అసహ్యించుకునేటువంటి అనేక చెడు అలవాట్లున్నాయని కూడా ఆమె గుర్తిస్తుంది. ముఖ్యంగా బిరేష్ తాగుడు పరోమితకు అసలు ఇష్టముండదు. కాని పరోమిత తమ ఇంట్లోనే ఉండే అత్తగారు సానాకాతో ఓ ప్రత్యేక ఆత్మీయానుబంధాన్ని పెంపొందించుకుంటుంది. అంతేకాదు మానసికంగా వైకల్యం చెందిన ఆడపడుచు ఖుఖుతో కూడా ఆమె సన్నిహితంగా మసలుతుంది.

భర్తతో అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆమె అనుబంధం బబ్లు పుట్టుకతో మరింత విచ్ఛిన్నమవుతుంది. మెదడుకు సంబంధించిన పక్షవాతంతో జన్మించిన బబ్లూను బిరేష్ ఆమెను ఓదార్చి నెమ్మదింపచేస్తుంది. సానాకా సాన్నిహిత్యంలో దగ్గరితనంలో పరోమిత తన దుఃఖాన్ని మరిచిపోతుంది. వారిద్దరి మధ్యా అత్తాకోడళ్ళుగా కంటే స్నేహానుబంధమే విస్తృతమవుతుంది. సంపూర్ణమైన ఎదుగుదలను పొందలేని బబ్లూ మరణం పరోమిత జీవితంలో మరో పెద్ద ఎదురుదెబ్బ అవుతుంది. అప్పటిదాకా భర్తతో ఆమెకు ఆ ఒక్క బంధం కూడా తెగిపోయినట్టూ పరోమిత భావిస్తుంది. బిరేశ్‌కు మరో స్త్రీతో సంబంధం పెరుగుతూ ఉంటుంది.

మరోవైపు మానసిక వికలాంగుల స్కూలులో తనకు పరిచయమయిన చలన చిత్రకారుడు సెమిరన్ వైపు పరోమిత ఆకర్షితురాలవుతుంది. ఇలా మారిన పరిస్థితులు పెరిగిన దూరాల ఫలితంగా పరోమిత వైవాహిక జీవితం విఫలమవుతుంది. భార్యాభర్తలిద్దరూ విడిపోతారు. అత్త సానాకా తీవ్రమైన మనస్తాపానికి గురవుతుంది. తనకూ కోడలకూ మధ్య దూరం పెరగడంతో సానాకా ఖిన్నురాలవుతుంది. అత్తాకోడళ్ళ బంధం విడిపోయినా వాళ్ళిద్దరి స్నేహబంధం సజీవంగా మిగిలిపోతుంది. వారి స్నేహం కొనసాగుతుంది. చివరికి మరణశయ్యపైన కూడా సానాకా తన మాజీకోడలు పరోమితా సాహచర్యంలోనూ ఉపచర్యలతోనూ ఉమశమనం పొందుతుంది. మనుషుల మధ్య అందులో ఇద్దరు స్త్రీల మధ్య అనేకమైన ఆటంకాల నడుమ పెనవేసుకున్న స్నేహబంధం మానవీయ విలువలకి అద్దం పట్టింది. సరికొత్త విస్తృతార్థాల్ని అనుభవంలోకి తెచ్చింది. పరోమిత సానకాల నడుమ ఉద్వేగాల్ని రికార్డు చేయడంలో అపర్ణాసేన్ గొప్ప ప్రతిభను కబర్చారు. ఇద్దరు స్త్రీల మధ్య పెనవేసుకునే ఆత్మీయానుభూతుల్ని ఈ చిత్రం విలక్షణంగా చిత్రించింది.

# రుడాలి

**భాష:** హిందీ, **కథ** - మహాశ్వేతాదేవి; **స్క్రీన్‌ప్లే** - గుల్జార్; **కెమెరా** - సంతోష్ శివన్, ధరమ్ గులాటి;
**సంగీతం** - భూపెన్ హజారిక; **దర్శకత్వం** - కల్పనా లాజ్మీ;
**నటీనటులు** - డింపుల్ కపాడియా, రాఖీ, రాజ్ బబ్బర్, అమ్జద్ ఖాన్, రఘువీర్ యాదవ్
**విడుదల:** 1993




**దృశ్యానికీ సంగీతానికీ** మధ్య కళాత్మక సమన్వయాన్ని సాధిస్తూ స్పష్టమైన అభివ్యక్తితో నిర్మితమైన చిత్రం 'రుడాలి' జీవితంలో ఆద్యంతం అనేక కష్టాల్ని చవిచూసి, సమస్త దుఃఖాల్ని అనుభవించిన స్త్రీ సానిచెరి. ఆమె పాత్రను ముఖ్యాభినేతగా చేసి నిర్మించిన రుడాలి ఒక విలక్షణమైన చిత్రం. కన్నతల్లి వదిలేసిపోగా అనాథగా, ఒంటరిగా ఎదిగిన దళితురాలు సానిచెరి, వర్గ, కుల లింగ వివక్షల మధ్య అష్టకష్టాలు పడి ఎదిగిన ఆమె జీవన పరిణామాన్ని ఈ చిత్రం గొప్పగా చూపిస్తుంది. నిలువెత్తు దుఃఖాన్ని నిటారుగా పోస్తే రూపొందిన సానిచెరి పాత్రయొక్క అంతరంగిక, సామాజిక ఘర్షణలే ఈ చిత్రానికి మౌలిక ఇతివృత్తం. అత్యంత సహనంతోనూ ధైర్యంతోనూ అన్ని బాధల్నీ దిగమింగి తనదైన జీవితాన్ని గడిపే సానిచెరి మానసికంగా గడ్డకట్టుకుపోయి ఉంటుంది. ఆమె కన్నీళ్ళు గుండె లోతట్టులో ఇంకిపోయి ఉంటాయి. ధిక్కారంతో సమాజంలోని అనేక విషయాల్ని త్రోసిరాజని జీవితాన్ని వెళ్ళదీసిన ఆమె పరిణామక్రమాన్ని చిత్రంలో అత్యంత కళాత్మకంగా ఆవిష్కరించారు దర్శకురాలు కల్పనాలాజ్మీ. డ్రామా, మెలోడ్రామాల మధ్య విభజన రేఖలా ఉన్న సున్నితమైన వెంట్రుకవాసి లైను మీద ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిభావంతంగా నిలిపారు.

పన్నెండేళ్ళపాటు శ్యాంబెనగల్ వద్ద అసిస్టెంటుగా పనిచేసిన కల్పనాలాజ్మీ మొట్టమొదటి పూర్తినిడివి చిత్రం 'ఏక్‌పల్' కూడా స్త్రీ సమస్యపైనే చిత్రించింది. దాంతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఆమె 1992లో నిర్మించిన 'రుడాలి'తో జాతీయ స్థాయిలో తమస్థానాన్ని నిలుపుకున్నారు. నిజానికి రుడాలి చూడటం ఓ అద్భుతమైన అనుభవం. ఆ చిత్రంలో సువిశాలమైన రాజస్థాన్ ఎడారి నేపథ్యంలో భూపెన్ హజారికా అందించిన సంగీతం. ఆయన పాడిన గీతాలు శ్రోతల గుండె లయని తప్పిస్తాయి.

రాజస్థాన్ లోని ఓ మారుమూల గ్రామంలో ఒంటరిగా నివసించే సానిచెరి, రాం అవతార్ సింగ్‌కు చెందిన హవేలీలో దాసిగా పనిచేస్తూ ఉంటుంది. రాం అవతారసింగ్ తమ్ముడు సానిచెరి సేవల్ని పాటలని ఇష్టపడి ఆమెకు ఓ చిన్న ఇల్లును బహుమతిగా ఇస్తాడు. ఆమె ఆ ఇంట్లో నివసిస్తూ ఉంటుంది. ముక్కుపచ్చలారని చిన్నపిల్లగా ఉన్నప్పుడే సానిచెరిని ఆమె తల్లి వదిలేసి ఓ నాటక కంపెనీతో వెళ్ళిపోతుంది. సానిచెరి ఒంటరిగానే ఎదిగింతర్వాత పెళ్ళి చేసుకుంటుంది. కాని భర్త తాగుబోతై ఆ తాగుడుకే బలి అయిపోతాడు. అప్పటికే ఆమెకు ఒక కొడుకు వాడి పేరు బుదువా. సానిచెరికి చిన్ననాటినుండే ఒంటరిగా ఉంటూ ఎవరితోనూ మనసు విప్పి మాట్లాడకపోవడం చేత దుఃఖమూ కన్నీళ్ళూ ఆమె దరికి చేరేవికావు. పిల్లగా ఉన్నప్పుడు దూరమైన తల్లికోసం ఏడ్వని సానిచెరిని భర్త మరణం కూడా కదిలించదు. ఆమె తన ఆశలన్నీ కొడుకు బుదువాపైనే ఉంచి కాలం గడుపుతూ ఉంటుంది. కాని బుదువా చెడు సావాసాలతో చెడు అలవాట్లకు బానిసైపోతాడు. చివరికి ఒకరోజు ఓ వేశ్యని పెళ్ళాడి ఇంటికి తెస్తాడు. మొదట విస్తుపోయిన సానిచెరి

తర్వాత తనతో ఉండిపొమ్మంటుంది. కోడలికి గర్భం అని తెలిసి తన మనవడి కోసం ఏ కష్టానికైనా సిద్ధపడుతుంది. వీధి మార్కెట్‌లో గుడ్డలమ్మే సానిచెరి తోటి హాకర్లు, సేట్లు తన కోడలి పట్ల అనుచితంగా ప్రవర్తించినపుడు ఎదురు తిరుగుతుంది. గతంలో ఆమె ఏమైనా కావచ్చు. కాని ఇప్పుడూ తన ఇంటి కోడలని ఆమె అందరితో పోట్లాటకు దిగుతుంది. అదే క్రమంలో కోడలు కూడా సలక్షణంగా ఉండాలని ఆదేశిస్తుంది. కాని సానిచెరి ఆదేశాల్ని లెక్కచెయ్యకుండా ఆమెతో సఖ్యంగా ఉండకుండా కోడలు తన గర్భాన్ని విచ్ఛిన్నం చేసుకుని ఇంట్లోంచి వెళ్ళిపోతుంది. తిరిగి గత జీవితం ప్రారంభిస్తుంది. సానిచెరి మనవడి రూపంలో ఉన్న మరోకల చెదిరిపోతుంది.

ఇంతలో హవేలీలో రాం అవతార్ సింగ్ తీవ్రమైన అస్వస్థతకు గురౌతాడు. తన మరణాంతరం తన కోసం ఏడ్చేవారు ఎవరూ ఉండరేమోనని రుడాలి కోసం కబురుపెడతాడు. రుడాలిది ఓ చిత్రమైన వృత్తి. ఎవరైనా మరణిస్తే ఆ మరణానికి సంతాపంగా దుఃఖాన్ని ప్రకటిస్తూ ఏడ్వడం ఆ వృత్తి లక్షణం. ఆ వృత్తిలో ఉన్న బికిని హవేలికి వస్తుంది. రాం అవతార్ సింగ్ మరణశయ్యపై ఉండడంతో అతని చావుకోసం ఎదురుచూస్తూ బికిని సానిచెరి ఇంట్లో బసచేస్తుంది. అప్పటిదాకా ఎవరి వద్దా మనసు విప్పని సానిచెరి క్రమంగా బికినికి దగ్గరై తన గతాన్ని ఆమె ముందు పరుస్తుంది. తన ఏడ్వలేనితనాన్ని కూడా చెబుతుంది. బికిని ఆశ్చర్యపోతుంది. ఎప్పటికైనా సానిచెరిని తనలాగే రుడాలీని చేస్తానంటుంది. ఆ ఇద్దరు స్త్రీల మధ్యా అన్యోన్యమైన స్నేహం విచ్చుకుంటుంది. బికిని తన గురించి పూర్తిగా చెప్పుకోక ముందే మరొకరి మరణవార్త వినివెళ్ళిపోతుంది. తప్పకుండా తిరిగి వస్తానని మాట ఇచ్చి వెళుతుంది. కాని ఆమె తిరిగిరాదు. రెండురోజుల తర్వాత బికిని మరణవార్త తెలిసి సానిచెరి హతాశురాలవుతుంది. ఆమె మరోకల చెదిరిపోతుంది. పైగా తనను చిన్ననాడు వదిలేసిపోయిన తన తల్లే బికిని అని తెలిసి ఆమె కదిలిపోతుంది. ఇంతలో హవేలి నుంచి మనిషి వస్తాడు బికిని కోసం. రాం అవతార్‌సింగ్ చనిపోయాడని చెబుతాడు. విభ్రాంతితో సానిచెరి హవేలికి వెళుతుంది. అక్కడ రాం అవతార్‌సింగ్ మృతదేహాన్ని చూసి జీవతంలో పడ్డ బాధలూ వెతలు ఒకొక్కటి గుర్తురాగా గుండె లోయల్లో ఘనీభవించిన కన్నీళ్ళన్నీ కరిగి ఉప్పెనై ఎగిసి ఆమె దుఃఖసాగరమౌతుంది. ఏళ్ళుగా పొరలు పొరలుగా పేరుకుపోయిన దుఃఖమంతా తెరలు తెరలుగా బహిర్గమతమవుతుంది.



మహాశ్వేతాదేవి కలం నుంచి జాలువారిన గొప్ప కథకు కల్పనా లాజ్మీ ప్రతిభావంతమైన దృశ్యరూపం కల్పించారు. సానిచెరి పాత్రలో డింపుల్ కపాడియా పరిపక్వమైన నటనను ప్రదర్శించారు. నిర్మాణపరంగా ఈ సినిమాకి ప్రారంభం, ఎత్తుగడ, కొనసాగింపు ఉపసంహారం ఇత్యాది క్రమబద్ధమైన లక్షణాలు ఉన్నప్పటికీ అంతా ఒక ఉద్వేగంతో కూడుకున్న దృశ్యాలతో చకచకా కదిలిపోతుంది. చిత్రానికి ఆద్యంతం నేపథ్యంలో నిలిచి ఉండే ఎడారి ఒకరకమైన గాంభీర్యాన్ని అందిస్తే సంగీతం దాన్ని రెట్టింపు చేస్తుంది.

మొత్తం మీద సానిచెరి, ఆమె జీవితం, ఆమె కలలు ఆమె ఆవేదనలు చివరిగా ఆమె కన్నీళ్ళు అన్ని కలగలసి దృశ్యకావ్యంలా రూపొందించిన చిత్రం ‘రుడాలి‘. స్త్రీ పాత్ర కేవలం ప్రొటగనిస్టుగానే కాక టొటాలిటీగా రూపొందిన ‘రుడాలి‘ ప్రభావవంతమైన సినిమాల జాబితాలోకి చేరుతుంది.

Click here to share your comments on this article.